13న పిఠాపురంలో జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలో ఈ నెల 13న 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విచారణలో ఉన్న కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొనే వీలు కక్షిదారులకు కల్పిస్తామన్నారు. కావున కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సివిల్, రాజీ పడదగిన క్రిమినల్, చెక్ బౌన్స్, మోటారు వాహన ప్రమాద, ట్రాఫిక్ చలానా, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, ఈ జాతీయ లోక్ అదాలతో పరిష్కరించుకొని అప్పీలు లేని అంతిమ తీర్పు పొందడం ద్వారా తమ విలువైన సమయాన్ని, ధనాన్ని వథా కాకుండా సత్వర న్యాయం పొందుతారన్నారు.

నైరాశ్యంలో జన సైనికులు

- పిఠాపురంలో అంతర్గత పోరు
- ఎవరికి వారే యమునా తీరే..

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. పార్టీని పటిష్టం చేసేందుకు పవన్ కల్యాణ్ చర్యలు తీసుకుంటున్నట్టుగా ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. అయితే పార్టీలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను కేడర్ అంతగా జీర్ణించుకోలేక లేకపోతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మారుతున్న పరిణామాల నేపథ్యంలో పిఠాపురం జనసేన పార్టీలో అంతర్గత పోరు పెద్ద ఎత్తున నడుస్తోంది. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ కోసం జనసేన పార్టీ ఐదుగురు సభ్యులతో కమిటీ వేసిన సంగతి తెలిసిందే. మొన్నటి వరకు ఇక్కడ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించిన అనపర్తి నియోజకవర్గానికి చెందిన మర్రెడ్డి శ్రీనివాస్‌ను ఆ కమిటీలో తొలగించడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి ఇక్కడ ఏం జరుగుతోందో, ఎటువంటి మార్పులు జరుగుతున్నాయో, ప్రస్తుతం పార్టీ పరిస్థితులు ఏమిటో అన్నది కేడర్‌కు అర్థం కాని పరిస్థితుల్లో కనిపిస్తున్నారు.

కొనసాగుతున్న అంతర్గత పోరు

మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, ఆయన అనుచరులు జనసేన పార్టీలో చేరినప్పటి నుంచి పాత, కొత్త కార్యకర్తల మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచీ కష్టకాలంలో కూడా పార్టీ జెండాను భుజాలపై మోస్తూ పవన్ కల్యాణ్ గెలుపు కోసం కృషి చేశామంటూ చెప్పుకుంటున్న కార్యకర్తల మధ్య ఎన్నికల అనంతరం పార్టీలో చేరిన నాయకులు మధ్య వర్గ విభేదాలు నడుస్తున్నాయి. దొరబాబు వర్గం వివిధ కార్యక్రమాల్లో ఒక వైపు చురుగ్గా పాల్గొంటుండగా ముందు నుంచీ ఉన్న వర్గం వీరితో కలిసి వెళ్లడం లేదు. దీంతో అంతర్గత పోరు తారా స్థాయికి చేరింది. దొరబాబు, ఆయన వర్గం పాల్గొనే కార్యక్రమాల్లో పాత కార్యకర్తలు ఎవరూ పూర్తిస్థాయిలో పాల్గొనక పోవడం చర్చనీయాంశంగా మారుతోంది. వైసిపి నుంచి వచ్చిన వారికి అధిష్టానం పెద్దపేట వేస్తోందన్న ఆరోపణలతో కొందరు బహిరంగంగానే సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా జనసేనాని తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి వారే యమునా తీరే..

కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, పార్టీ రాజకీయ వ్యవహారాలను చక్కబెడుతున్న ఎంఎల్‌సి పి.హరిప్రసాద్, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, పార్టీ ఇన్చార్జిగా ఉన్న మర్రెడ్డి శ్రీనివాస్‌ను ఫైవ్ మేన్ కమిటీగా నియమించారు. పార్టీ నిర్మాణం, పార్టీ శ్రేణుల బలోపేతం, శ్రమించిన వారికి గుర్తింపు, గ్రౌండ్ లెవెల్ కార్యకర్తల అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం పిఠాపురంలో పార్టీ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణకు పవన్ శ్రీకారం చుట్టాలనే ప్రచారం నేపథ్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా



మర్రెడ్డిపై పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పవన్ కల్యాణ్ నెల రోజుల క్రితమే ఆయన్ను తప్పించి, చేబ్రోలు ప్రాంతంలో జనసేన పార్టీ సమావేశాలు, వసతి వంటి సౌకర్యాలు అందించిన ఓదూరి కిషోర్‌ను కొత్త సభ్యుడిగా నియమించారు. ఇదంతా బాగానే ఉన్నా ఫైవ్ మెన్ కమిటీలో సభ్యులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారారని పార్టీలో కార్యకర్తల నుంచే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్సీగా ఉన్న హరిప్రసాద్ స్థానికంగా ఉండకపోవడంతో ఆయన ఇక్కడ పరిస్థితులను అంతగా చక్కదిద్దలేకపోతున్నారనే భావన స్థానిక కార్యకర్తల్లో వినిపిస్తోంది. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఎక్కువగా ఢిల్లీలో ఉంటూ పార్లమెంటరీ వ్యవహారాలపైనే ఉంటున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలో పలు సమావేశాలను నిర్వహించి పార్టీ కార్యకలాపాలపై దృష్టి పెట్టినప్పటికీ ఆ తర్వాత ఎటువంటి దిశా నిర్దేశం లేకపోవడంతో కేడర్ నిరుత్సాహంలో కనిపిస్తోంది. మరోవైపు డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు పెద్దాపురం నియోజకవర్గానికి చెందినవారు కావడంతో ఈ నియోజకవర్గంలో అంతగా పట్టు సాధించలేకపోతున్నారని అంటున్నారు. మరో వైపు వైసిపి నుంచి పార్టీలోకి చేరిన దొరబాబుపై కేడర్ తీవ్ర అసంతృప్తితో ఉందని, ఆయనపై కూడా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఆయన కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఉంటున్నారు. ఇక ఇటీవల ఫైవ్ మేన్ కమిటీలో సభ్యుడుగా చేరిన ఓదూరి కిషోర్ ఒంటెత్తు పోకడలకు పోతున్నారనే విమర్శలు ఆయనపై వినిపిస్తున్నాయి. మిగిలిన 5 మాన్ కమిటీలో సభ్యులతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండానే కిషోర్ వివిధ గ్రామాలలో పర్యటిస్తూ ఒంటరిగానే పార్టీ కేడర్‌తో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఒక వర్గం కార్యకర్తలను కలిసి మరో వర్గాన్ని విస్మరిస్తున్నారన్న విమర్శలు ఆయనపై వినిపిస్తున్నాయి.

ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ గెలుపు కోసం నిరంతరం శ్రమించిన కొందరు ముఖ్య కార్యకర్తలు ఇప్పుడు పార్టీ కార్యకలాపాలకు దూరమవుతున్నారు. ప్రధానంగా పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన డాక్టర్ పిల్లా శ్రీధర్ గత 8 ఏళ్లలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పలువురికి అండదండలు అందించారు. అధికారంలో లేనప్పుడు పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో విస్తతంగా ప్రచారం చేసిన ఆయన ఇప్పుడు పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు. గొల్లప్రోలుకు చెందిన మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్య నాయుడు, నిన్న మొన్నటి వరకు పిఠాపురం పట్టణంలో పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన చెల్లుబోయిన సతీష్ వంటి ముఖ్య కేడర్ ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. పార్టీలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అసంతృప్తితో పలువురు సాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ ఏమి చర్యలు తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నారు.

భూముల ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం మహారాజా దానం చేసిన ఆనంద నిలయంకు చెందిన సుమారు రూ.వెయ్యి కోట్ల ఆస్తి ఆక్రమణ, ఐటి సెజ్ అభివృద్ధి, కాకినాడ నగరాభివృద్ధి తదితర అంశాలపై గురువారం కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ విద్యా వికాసం కోసం దాతలు దానం చేసిన భూముల అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, దాతల ఆశయానికి తూట్లు పొడుస్తూ రూ.వెయ్యి కోట్లు విలువైన ఆనంద నిలయం భూమిపై అక్రమార్కుల పాగా, అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రికి వివరించినట్టు తెలిపారు. కాకినాడ సర్పవరంలో ఐటి సెజ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరామన్నారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సమాచార సాంకేతిక విద్యను అభ్యసించిన యువత అభివృద్ధి కోసం కాకినాడ సర్పవరంలో భూమి కేటాయించి ఐటి-సెజ్‌కు అంకురార్పణ చేసినట్టు తెలిపారు. ఐటి-సెజ్ అభివృద్ధి కోసం 25.73 ఎకరాలు కేటాయంచగా అందులో 15.14 ఎకరాలు అభివృద్ధి చేయగా, మిగిలిన భూమి 10.59 ఎకరాలు రోడ్లు, ఇతర అవసరాలకు కేటాయించినట్టు తెలిపారు. ఇంకా అందుబాటలలో ఉన్న భూమిని స్టార్టప్ కంపెనీలకు కేటాయించి, కాకినాడ ఐటి సెజ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు.

సిఎంకు సమస్యలను వివరిస్తున్న ఎంఎల్‌ఎ కొండబాబు

పెద్దాపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోటనందూరు, పెద్దాపురం

విశాఖపట్నంలో సిఐటియు 18వ జాతీయ మహాసభకు తరలిరావాలని సిఐటియు కోటనందూదరు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ, ముక్కుడుపల్లి బాబూరావు పిలుపు ఇచ్చారు. సభల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఎండి రూఫీ, శేఖరు, సత్యవతి దేవుడమ్మ, లోవ కుమారి, లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కోటనందూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దాపురం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం యాసలపు సూర్యారావు భవనంలో టిఎల్.పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. జాగారపు సూర్య కుమారి, చంటి, దేవి, హరీష, రత్నకుమారి, బేబీ కుమారి, ప్రవీణ, రామలక్ష్మి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ రికార్డుల ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలో ఓటర్ జాబితా పరిశీలన, సరిచూసే ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు బూత్ లెవెల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. 2002లో నమోదైన ఓటర్ల వివరాలను 2005 రికార్డులతో స్పెషల్ ఇన్సెంటివ్ రీజన్ (ఎస్ఐఆర్) విధానంలో త్వరితగతిన సరిపోల్చాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ వివరాలను విశ్లేషించి ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఈ ప్రక్రియ మందగించిన విషయాన్ని గుర్తుచేస్తూ అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- తాళ్లరేవు

విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో, పల్లిపాలెం ఫీడర్‌పై పనుల నిమిత్తం శనివారంఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. పి.మల్లవరం, పత్తిగొంది, జార్జిపేట, ఎంఎల్‌కె.నగర్, నీలపల్లి. పోలేకుర్రు, గ్రాంటు గ్రామాలు, గాడిమొగ, భైరవపాలెం, చొల్లంగి, చొల్లంగి పేట, పటవల, కొత్తూరు, రామన్నపాలెం, మట్లపాలెం, వేమవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కార్టూ'నిజం'



పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పదవ తరగతి పరీక్షలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయులు 100 రోజుల ప్రణాళికని ఏ విధంగా నిర్వహిస్తున్నదీ పరిశీలించారు. అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. యుటిఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి జి.వెంకటరావు, ఉపాధ్యాయులు కెవివిఎన్ఎస్.ప్రసాద్, ఎం.శివప్రసాద్, విజయ, షర్మిల, సంధ్య, సుజాత, శాంత కుమారి, అమూల్య, కె.ప్రసాద్, నానాజీ, పథ్వి, చిన్నారావు, మహాదేవి, దీపాంజలి పాల్గొన్నారు.

సామర్లకోట శ్రీశారద రామకృష్ణ సేవాసమితిలో శారదా దేవి 1073 వ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వింజమూరు విశ్వనాథ్, నువ్వుల వెంకటరాజు, చందువోలు సత్యనారాయణ మూర్తి, తోట రమణ, నువ్వుల బాబ్జి, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

సామర్లకోటలో పుస్తకాల పంపిణీ

డిఇఒ పిల్లి రమేష్ కు వినతిపత్రం అందిస్తున్న సిఆర్‌ఎంటిలు

సిఆర్‌ఎంటిల సమస్యలపై 15న ధర్నా

ప్రజాశక్తి కాకినాడ

సమగ్ర శిక్షలో పనిచేసే క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్స్ వేతనాలు పెంచాలని, దూర ప్రాంతాల బదిలీలు ఆపాలని, హెచ్.ఆర్ పాలసీ, మినిమం టైమ్ స్కెల్ అమలు చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద ఈ నెల 15వ తేదీన ధర్నా చేపడుతున్నామని డిఇఒ పిల్లి రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి క్లస్టర్ మొబైల్ టీచర్స్ యునైటెడ్ ఫోరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తెలిపే రామ్‌జీ ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడారు. తరాల మీరా సాహెబ్, ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా హాక్ స్ప్రింట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీలో హాక్‌స్ప్రింట్-2కె25 హ్యాకథాన్‌ను గూగుల్ క్లౌడ్ సహకారంతో ఘనంగా నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ హ్యాకథాన్‌ను గీక్స్ ఫర్ గీక్స్ టీమ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిభావంతమైన కోడర్స్, డిజైనర్లు, సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేసే, నిజ జీవిత సమస్యలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభావవంతమైన పరిష్కారాలు రూపొందించేందుకు అద్భుతమైన వేదికగా నిలుస్తోందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మొత్తం 148 జట్లు, 621 మంది పాల్గొంటున్నట్లు డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-గండేపల్లి

వాలీబాల్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తున్న విషయం విదితమే. రెండో రోజు పోటీలు వివిధ టీముల మధ్య హోరాహోరీగా సాగాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పూల్ డి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ నిర్వహణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం పోటీలు నాకౌట్ కమ్ లీగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో రోజు ఉదయం ప్రారంభమైన పోటీలు సాయంత్రం వరకూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్కంఠగా సాగాయి.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- తాళ్లరేవు, సామర్లకోట

బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని, చేసిన వారికి శిక్షలు తప్పవని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ చిన్నబాబు హెచ్చరించారు. బాల్య వివాహముక్తభారత్ 100 రోజుల క్యాంపైనింగ్ కార్యక్రమంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సిహెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు, సిడిపిఒ శ్రీదేవి ఆధ్వర్యంలో మల్లవరం, పత్తిగొంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవాని, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్లకోట సమాజంలో బాల్యవివాహాలు నేరమని 1098 జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష పేర్కొన్నారు. సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్లో గురువారం చైల్డ్ హెల్ప్ లైన్ విద్యాశాఖ ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఎం కె.శ్రీదేవి అధ్యక్షతన బాల్య వివాహ ముక్తభారత్ ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, నళినిపాల్గొన్నారు.

సామర్లకోటలో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న మున్నారా ఆగ్రో టెక్నాలజీ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది

అందుబాటులో అమ్మోనియం సల్ఫేట్ ఎరువు

ప్రజాశక్తి-కాకినాడ

రైతుల సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకుని మున్నారా ఆగ్రో టెక్నాలజీస్ ద్వారా అమ్మోనియం సల్ఫేట్ ఎరువును అందుబాటులోకి తీసుకొచ్చామని సంస్థ ఎండి సిఎస్ఆర్ నాయుడు తెలిపారు. గురువారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అధిక దిగుబడి, నాణ్యత, తక్కువ వ్యయంతో ఉన్నత ఫలితాలు అందించేందుకు తమ సంస్థను స్థాపించామని తెలిపారు. దీనిలో భాగంగా అమ్మోనియం సల్ఫేట్ ఎరువును గుళికల రూపంలో దేశంలో తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రైతులకు వెదజల్లడానికి, కరిగించుకోవడానికి అనుగుణంగా దీనిని తక్కువ ధరకు అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఆధునిక ఉత్పత్తులను రైతులకు చేరవేసే సంకల్పంతో తాము ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.దుర్గా లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ మిషన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో పలు ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్ గురువారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. దానికి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్, ఆడియో మెట్రీషియన్, టిబి హెల్త్ విజిటర్, ఫార్మాసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్వైజర్, డిస్టిక్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, పబ్లిక్ అండ్ ప్రైవేటు మిక్స్ కో ఆర్డినేటర్ ఫర్ టిబి, అకౌంటెంట్, డ్రగ్ రేసిస్టెంట్ టిబి కౌన్సిలర్, ఎల్‌జిఎస్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ స్వీకరిస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడ డిఎం హెచ్‌ఒ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తుదారులకు సంబంధించిన నోటిఫికేషన్, అప్లికేషన్ ప్రొఫార్మా http://eastgodavari.ap.gov.in, http://kakinada.ap.gov.in, http://konaseema.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

గురుకుల పాఠశాలకు రూ.1.16 కోట్ల నిధులు

ప్రజాశక్తి- తాళ్లరేవు

చొల్లంగి పేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల అభివృద్ధికి ఒఎన్జిసి సిఎస్ఆర్ నుంచి రూ.1.16 కోట్ల నిధులు మంజూరయ్యాయని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. విద్యార్థినులు ఎదుర్కొన్న పరిస్థితులను గమనించి పలు దఫాలు జిల్లా కలెక్టర్, ఒఎన్‌జిసి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి ఈ నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ నిధులతో హాస్టల్ గదుల్లో విద్యార్థినుల కోసం కొత్త బెడ్ల ఏర్పాటు, విద్యార్థినుల వసతి గదుల ఆధునికీకరణ, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు.

వివాదం నేపథ్యంలో ఆర్‌డిఒ చర్చలు

ప్రజాశక్తి- గొల్లప్రోలు

స్థానిక కరణం గారి తోట ప్రాంతంలో క్రైస్తవులు, హిందువులు మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఆర్‌డిఒ మల్లిబాబు గురువారం ఇరు గ్రూపులతోబ విడివిడిగా చర్చలు జరిపారు. క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని పాస్టర్లు, ప్రజలతో మాట్లాడి చెబుతామని హిందువులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మల్లిబాబు మాట్లాడుతూ ఉద్రిక్త పరిస్థితులు తగ్గించేందుకు సానుకూలమైన వాతావరణంలో చర్చలు జరిగాయని ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఈ చర్చల్లో సిఐ జి.శ్రీనివాస్, తహశీల్దారు రామ్ కుమార్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న ఆర్‌డిఒ మల్లిబాబు

మిత్రునికి నివాళిగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పెద్దాపురం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వరహాలయ్యపేట నివాసి జామి ఆనంద్ మృతికి నివాళిగా ఆయన స్నేహితులు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ తాతయ్య అప్పారావు, తల్లిదేవి, అన్నయ్య కార్తీక్ రక్తదానంలో పాల్గొన్న వారిని అభినందించారు.

రక్తదానం చేస్తున్న ఆనంద్ స్నేహితులు

పంట పొలాల్లో మంటలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

పంట పొలాల్లో గడ్డిని మండించడం ద్వారా పచ్చని పల్లెల్లో సైతం వాయు కాలుష్యం పెరిగిపోతోంది. యంత్రాల ద్వారా వరి కోతలు కోసిన పొలాలలో ఇప్పుడు ఎక్కడ చూసినా అగ్ని కీలలు కనిపిస్తున్నాయి. దట్టమైన పొగ అల్లుకుని పొలాలన్నీ మంటలలో కాలి బూడిద అవుతున్నాయి. పంట కోసిన తరువాత ఉన్న గడ్డి బయటికి తీయలేని చాలా మంది రైతులు దానికి మంట పెట్టి కాల్చుతున్నారు. ఇలా వరి భూములను మండించడం వల్ల భూసారం తగ్గిపోవడమే కాక పంటకు మేలు చేసే మిత్రపరుగులు, కొన్ని లవణాలు నష్టపోతారు.

నేరాలు ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - వాగల్లు

మండలంలోని గొరపల్లి శివారు నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,060 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.సురేంద్ర తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బాలుని మృతి కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం గ్రామానికి చెందిన బాలుడు మృతికి కారణమైన వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు నిచ్చారని కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. 2018లో మాధవ రాయుడుపాలెం గ్రామానికి చెందిన శీలం సంతోష్‌కుమార్ అనే బాలుడు జేగురుపాడులో పెట్రోల్ దొంగతనం చేస్తున్నాడని అనుమానంతో జేగురుపాడు గ్రామానికి చెందిన రాయి వెంకన్న నల్లి శేఖర్ తీవ్రంగా కొట్టారు. అనంతరం బాలుడు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై అప్పటి సిఐ ఎం.సురేష్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఏడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ గంధం సునీత తీర్పునిచ్చారని తెలిపారు.

ప్రాణాలు తీసిన అతివేగం

ప్రజాశక్తి - జగ్గంపేట

అతి వేగం కాస్తా ఇద్దరి ప్రాణాలు తీసింది. వేగాన్ని అదుపు చేయలేక కారు స్కూటర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయిన ఘటన గురువారం మండలంలోని రామవరం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలేశ్వరానికి చెందిన దొండపాటి శ్రీను, అతని తాత బొల్లు సూరరావులు స్కూటర్‌పై రామవరం వెళ్లారు. అక్కడ రోడ్డు చెంతన ఆగారు. ఈ సమయంలో విశాఖ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సూరరావు(64) అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీను గాయాలతో బయటపడ్డారు. కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బి.శ్రీదేవి(35) మృతి చెందింది. ఎస్ఐ రఘునాథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

కిర్లంపూడి మండలం బురుగుపూడి వద్ద గంజాయి తరలిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు గురువారం పోలీస్ స్టేషన్ వద్ద వివరాలు వెల్లడించారు. 24.690 కేజీల గంజాయిని బైకులపై తీసుకు వెళ్తుండగా బురుగుపూడి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఏడుగురిని అరెస్ట్ చేసి మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ జి.సతీష్‌ను డిఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బైకుల చోరీ కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి-పిఠాపురం

బైకుల చోరీ కేసులో ముద్దాయిలకు పిఠాపురం అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ టివి అపర్ణ జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సిఐ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఠాపురం సర్కిల్ పోలీస్ స్టేషన్లతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 48 బైకుల దొంగిలించినట్లు కేసులు నమోదు అయ్యాయన్నారు. ఈ కేసుల్లో అగ్రహారం నివాసి శొంటిని గంగరాజు, అతనికి సహకరించిన గణేశుల ఆనంద్ కుమార్, కార్తిక్ సత్తిబాబు, కురుమళ్ల వీరబాబులను అరెస్టు చేసి 48 బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై నేరం రుజువు కావడంతో మొదటి ముద్దాయికి ఒక్కో కేసుకూ 13 నెలల చొప్పున జైలుశిక్ష, సహకరించిన మరో ముగ్గురు ముద్దాయిలకు ఒక్కో కేసుకూ ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక జివిఆర్ జంక్షన్ వద్ద గురువారం రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. అడ్డతీగల మండలం గొంటువానిపాలెంకు చెందిన ఒక వ్యక్తి బైక్‌పై జగ్గంపేట వైపుకు వెళ్తుండగా మరో బైక్‌పై ఇద్దరు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టారు. దీంతో ఢీకొట్టిన ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని గండేపల్లి మండలం జెడ్.రాగంపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

సైనిక సంక్షేమ శాఖ అధికారిగా కృష్ణారావు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా మజ్జి కృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్టణంలో ఆయన శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా నూతన సైనిక సంక్షేమ శాఖ అధికారిగా ఆయన నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలిని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

కంకర గుట్టల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

బైకు జారితే ప్రాణాలకే ప్రమాదం అనే శీర్షిక ఈ నెల 9న ప్రజాశక్తిలో కథనం వెలువడంతో అధికారులు స్పందించారు. ప్రత్తిపాడు లంపకలోవ గ్రామానికి వెళ్లే రహదారిపై కంకర గుట్టలు అడ్డంగా వేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న విషమై పత్రికలో రావడంతో అధికారులు స్పందించారు. రహదారిపై ఉన్న కంకరను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

రోడ్డుపై తొలగించిన కంకర

యానాం వార్తలు

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

స్థానిక బెజవాడ గార్డెన్, గోపాల్ నగర్, శ్రీరామ్ నగర్, కనకాలపేటలోని తిరుమల నాయుడు కాలనీ, ఫిషర్మెన్‌పేటలో రోడ్లు, డ్రైనేజీ పనులకు స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎంఎల్ఎకు పలు సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్ కుమార్, ఇంజనీర్లు జ్యోతిరాజు, కుమార్, వర్క్స్ ఇన్స్పెక్టర్ పోలిశెట్టి ఆదినారాయణ, నాయకులు పంపు సిద్ధార్థ కుమార్, కవల గణపతి, కవల బాబులు, పుగాకు వాసు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య భారతికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ అంకిత్ కుమార్, ఎస్పీ వరదరాజన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పునీత్ రాజ్, ఎస్ఐ కవల రమణ మూర్తి, కొల్లు ప్రసాద్, హంసాని రామలక్ష్మణుడు, రాజు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కర్రి దివ్య

కార్తికేయ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

మండలంలోని కొండెవరంలో కార్తికేయ హాస్పిటల్ అధినేత డాక్టర్ మొగల్ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కర్రి దివ్య పలువురిని పరీక్షించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. 250 మందికి ఉచితంగా వైద్య సేవలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పుల్ల కొండబాబు, మారిశెట్టి సత్తిబాబు, తోట ప్రసాద్, గాది నాని, గాది రాజేష్, మేడిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

సేవతో ప్రజల మనసుల్లో స్థానం పొందాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

సభలో మాట్లాడుతున్న బిషప్ ఉడుముల బాల

నిస్సహాయులకు సేవ చేయడం ద్వారానే ప్రజల మనసుల్లో స్థానం పొందగలరని అర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. తాళ్లరేవులో నూతనంగా నిర్మించిన ఎంఎస్ఎఫ్ఎస్ గురు నిలయాన్ని వైజాగ్ ప్రావిన్స్ ప్రొవిన్షియల్ సుపీరియర్ డాక్టర్ సురేష్ బాబుతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గురు నిలయం అధినేత బాలశౌరి ఆధ్వర్యంలో జరిగిన సభలో బిషప్ బాల మాట్లాడారు. మత గ్రంథాలు చేత బూని ప్రసంగాలు చేయడం కన్నా, మదర్ థెరిసా వలే అవసరమున్న పేదలకు సాయం చేయడం ద్వారా గుర్తింపు పొందవచ్చని ఆయన అన్నారు. ఆ విధంగానే దుగ్గింపూడి బాలశౌరి తాళ్లరేవు ప్రాంతంలో గుర్తింపు పొందారన్నారు. ఈ సందర్భంగా గురు నిలయం వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు.

రోలర్ స్కేటింగ్‌లో కావ్యశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ బాలిక రోలర్ స్కేటింగ్‌లో జాతీయస్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచింది. స్థానిక అక్షయ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థిని ఆకుల కావ్యశ్రీ విశాఖపట్నంలో జరుగుతున్న రోలర్ స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించింది. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కావ్య శ్రీని అభినందించి నగదు బహుమతి అందజేశారు. భవిష్యత్తులో కావ్య శ్రీ దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బాలిక తండ్రి సత్తిబాబును అభినందించారు.

సాయం అందిస్తున్న ముదునూరి

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

పెద్దిపాలెంలో అగ్ని ప్రమాద బాధిత మూడు కుటుంబాలను ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్, వైసిపి నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని ఓదార్చారు. రాళ్ల అప్పారావు, రాళ్ల రాజు, రాళ్ల ఆనందరావుకు, రూ.10 వేల చొప్పున, పిల్లి సూరిబాబు కుటుంబానికి రూ.5000 వేల చొప్పున ఆర్థిక సాయం మురళీ కృష్ణంరాజు అందజేశారు. మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో కాలిపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి సూరిబాబు మేకా చంటిబాబు, విత్తనాల నాగేశ్వరరావు, దేవ లక్ష్మణ్, తుట్ట జమిందార్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం కోసం పరిశీలన

ప్రజాశక్తి -కరప

కరప గ్రామం రైతులు సహపురం మురుగు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరడంతో రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ఆదేశాలతో డ్రైనేజ్ ఇఇ కె.సుబ్బారావు గురువారం కాలువను పరిశీలించారు. సహపురం మురుగు కాలువ వంతెన నిర్మాణానికి అనుకూలమైన ప్రదేశాలు పరిశీలించారు. ఎస్టిమేషన్ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు యళ్ల సత్యనారాయణ, రైతు కర్రెద్ద చిలకమ్మ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

ప్రజాశక్తి -కరప

కరప గ్రామం పల్లిపేటకు చెందిన ఒక కుటుంబానికి గురువారం ఆసరా చారిటబుల్ ప్రతినిధులు అందజేశారు. వాడ్రేవు నూకరాజు గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆ కుటుంబానికి సాయం అందించాలని కోరడంతో ఈ విషయాన్ని ఆసరా చారిటబుల్ ట్రస్ట్‌కు తెలిపారు. ట్రస్ట్ వెంటనే స్పందించి బియ్యం, రూ.3000 విలువైన నిత్యావసర వస్తువులు అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులకు పోలిశెట్టి తాతీలు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్వాక్రా సంఘాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో డ్వాక్రా సంఘాల సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం గండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నాలుగు బృందాలతో 26 గ్రామ సంఘాల్లో పుస్తక నిర్వహణ, స్త్రీనిధి, ఉన్నతి అప్పుల రికవరీ, అప్పుల చెల్లింపు విధానంపై మురారి, మల్లేపల్లి, తాళ్లూరు, నీలాద్రిరావుపేట, సూరంపాలెం, కె.గోపాలపురం, ఉప్పలపాడు గ్రామ సంఘాలకు వెళ్లారు. సంఘాల స్థితి గతులు తెలుసుకున్నారు. త్వరితంగా ఎటువంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి ఎపిఎం జిలానీ, సిసిలు పాల్గొన్నారు.

పాలకోవా తయారీ యంత్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక దర్గా సెంటర్ సమీపంలో అప్పారావు పాలకోవా తయారీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాలకోవా తయారీ ఆధునిక యంత్రాలను డిఎస్‌పి శ్రీహరి రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడుతూ పాలకోవా తయారీలో దశాబ్దాల చరిత్ర గల అప్పారావు పాలకోవా కేంద్రం మరింత అభివృద్ధి చెందాలన్నారు. కుటీర పరిశ్రమదారులందరూ యాంత్రీకరణ ద్వారా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల కోవా కేంద్రం యజమాని వంశీకృష్ణ పాల్గొన్నారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -పెద్దాపురం

స్థానిక శ్రీవీరాజు హైస్కూల్లో నిర్వహిస్తున్న పెద్దాపురం ఛాంపియన్ లీగ్ క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. ఎఫ్‌సిసి, యంగ్ ఫైటర్స్ మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌లో యంగ్ ఫైటర్స్ విజయం సాధించగా, గల్లీ క్రికెటర్స్, ఎస్‌విహెచ్ఎస్ జూనియర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గల్లీ క్రికెటర్స్ విజయం సాధించారు. ఈ మ్యాచ్‌లలో ఇర్ఫాన్, రమేష్ రాజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సాయి, నాగేంద్ర సాయి, భీమ సాయి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తోన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషితో నియోజకవర్గంలో ఉన్న రహదారులను అభివృద్ధి చేస్తామని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరం మండలం మర్రివీడు గ్రామానికి రూ.కోటి 40 లక్షలతో మూడు కిలోమీటర్ల బిటి రోడ్డును నిర్మించడానికి చర్యలు చేపట్టడంతో ఎంఎల్ఎను ఏలేశ్వరం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.విజయ బాబు, టిడిపి నాయకులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, మాజీ జెడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జమునా నగర్ పాఠశాలలో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం జమునా నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలతో సమావేశమై పాఠశాలలో అమలవుతున్న గ్యారెంటీ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మురళీకృష్ణ, జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన భాషా ఉత్సవ్

ప్రజాశక్తి - సామర్లకోట

ఆధునిక తమిళ కవి సుబ్రహ్మణ్యం భారతి సేవలు చిరస్మరణీయం అని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్థానిక పిఎంశ్రీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం భారతీయ భాషా ఉత్సవ్ 2025 ముగింపులో భాగంగా ప్రముఖ తమిళ కవి సుబ్రహ్మణ్యం భారతి జయంతి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు భారతీయ భాషల్లో ఉండే సౌందర్యాన్ని, గొప్పతనాన్ని వివరించారు. తొలుత సుబ్రహ్మణ్యం భారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.గిరిప్రసాద్, జి.వేవీ రాణి, వి.దుర్గాప్రసాద్, షైదున్నీసా బేగం, జి.బి.త్రివేణి పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఈనెల 13 జరిగే నవోదయ పరీక్షల నేపథ్యంలో ఆ పరీక్షకు హాజరవుతున్న కపిలేశ్వరపురం ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం స్థానిక కోరాటి వారి వీధి ప్రాథమిక పాఠశాలలో నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ నమూనా పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పరీక్ష నిర్వాహకులు ఉపాధ్యాయులు సి హెచ్ టి.చంద్రమౌళి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు ఎస్.జె.కోటేశ్వరరావు, ఎన్. సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు ఎ.సూరిబాబు, మాచర టిటి వెంకట్రావు, ఉపాధ్యాయులు పిఎస్ ప్రియాంక పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో రీజినల్ క్రిస్మస్ మహోత్సవం సందర్భంగా గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ డి.వెంకట పాల్, డాక్టర్ పద్మ కుమార్ కాడా, డాక్టర్ పురుషోత్తమ దాస్ లంక, జోసెఫ్ బెన్నీ, డాక్టర్ సీరం ఐజాక్, టి.బెస్టింగ్, సిబిఎ సుకుమార్, ఎ.చంటి, సిహెచ్.దేవదాను, జి.సత్యానందం, పి.తిమోతి, జి.జోసెఫ్ కుమార్, సువర్ణ కుమార్, చందు స్టీఫెన్, జయ బాబు, ఆనంద సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతి అవలంబించాలి

ప్రజాశక్తి -కరప

సమావేశంలో మాట్లాడుతున్న డిఇ ఆనంద్ కుమార్

రైతులు సాగు నీరు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఇరిగేషన్ డిఇ పి.ఆనంద్ కుమార్ సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం కరప డిసి చైర్మన్ పి గంగ సత్యనారాయణ అధ్యక్షతన ఇరిగేషన్, డ్రైనేజీ అధికారుల ఆధ్వర్యంలో నీటి సంఘం నాయకులతో సాగునీరు సరఫరా, కాలువల ఆధునీకరణ తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ తక్కువ కాలంలో పంట దిగుబడి వచ్చే వరి విత్తనాలు వేయడంలో పద్ధతిని పాటించాలని, పంట కాలువలలోని సాగునీరు వృథా పోకుండా పాటించాల్సిన విధానాలను, రైతులకు నీటి సంఘం నాయకుల ఆధ్వర్యంలో చైతన్య పరచాలని సూచించారు. ఏఇ నాగభవానీ, డ్రైన్స్ ఏఇ కె.సుబ్బారావు, డిసి వైస్ ప్రెసిడెంట్ మెర్ల వెంకట ప్రభాకర్ చౌదరి, తుమ్మలపల్లి గోవిందరాజు, గంటా వీరన్న చౌదరి, దూడల నారాయుడు, బొగిరెడ్డి కొండబాబు, గోన అంజి పాల్గొన్నారు.

'చలో వైజాగ్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రంగా ఆశయసాధనే లక్ష్యంగా పనిచేస్తామని,ఎంఎల్ఎ నానాజీని కలిసి రూరల్‌లో రంగా విగ్రహం ఏర్పాటు చేస్తామని ఉమ్మడి జిల్లా రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు సలాది శ్రీనివాస్ బాబు అన్నారు. స్థానిక గొల్లపేటలో వివిధిలు ఫంక్షన్ హాల్లో సలాది శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ నెల డిసెంబర్ 26న 'చలో వైజాగ్' సభను విజయ వంతం చేయాలని పిలుపు ఇచ్చారు. మెహర్ గంగాధర్, చూరాని మనోజ్, కొండపల్లి పుత్రరావు, అడబాల సత్యనారాయణ, పాండ్రంకి రాజు, బాబూరావు, పస్పీర్ వెంకటేశ్వరరావు, హిట్లర్, పట్టిసిడి ఉజయ్, బిందాన సురేష్, గరగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

In the Court of the VI Additional District Judge at Kakinada
D.O.P.No. 135/2023

Between:-
Vasupalli (Seeram)Mary ...Petitioner
And
Seeram Lachanna ...Respondent

To. Seeram Lachanna S/o.Peda Simhadri @ SolemanRaju, R/o.D.No. 16-06-32, Thiridi vari veedhi, Dummula peta,Kakinada, Kakinada District.

పై నంబరు కేసులో పిటిషనరు తన భర్త అయిన మీపై విడాకుల కొరకు పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టువారు ఎన్ని నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.08-01-2026నందు తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30నిలకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. లేనిచో మీపై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం)
K.Sanku Singh
Advocate, Kakinada
Cell.9848164808

పాస్ పోర్ట్ పడిపోయినది

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన చుక్క హర్షవర్ధన్ తండ్రి వెంకటరమణ అను నేను 10-11-2025 వ తేదీన నా పాస్‌పోర్ట్ నెం C 9996066 ను తీసుకుని జిరాక్స్ నిమిత్తం లింగంపర్తి గ్రామం నుండి ఏలేశ్వరం వచ్చేసరికి నా పాస్ పోర్ట్ ఒరిజినల్ గల కవరు ఎక్కడో పడిపోయినది. నా పాస్ పోర్టు కొరకు చుట్టుపక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు ఇవ్వగలరు.

చుక్క హర్షవర్ధన్
తండ్రి వెంకటరమణ
లింగంపర్తి గ్రామం, ఏలేశ్వరం మండలం
కాకినాడ జిల్లా. సెల్:7396359444.

ప్రకటన

మా క్లయింటు డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం స్టేషన్ పేట నివాసి శ్రీ సందిక శ్యామ్‌సన్ గారి భార్య నాగమణి గారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటుకు వారి తల్లి గారైన శ్రీమతి వేమగిరి(బిల్లి)మూర్తమ్మ భర్త సూరయ్య గారు ఆమె స్వార్జిత హక్కు భుక్తంలో వున్న ఆలమూరు గ్రామంలో డోర్‌నెం.2-13 ప్రక్కన గల ఖాళీ నివాసస్థలం పొడవు 41"3, వెడల్పు 18" మొత్తం 83.32 చ.గ. నివాస స్థలం మా క్లయింట్ కుమార్తె అయిన మా క్లయింటుకు 27-10-2014న వీలునామా ద్వారా దాఖలు పర్చియున్నారు. సదరు స్థలం మా క్లయింటు హక్కుభుక్తంలో వున్నది. దానిపై ఎవరికి ఏవిధమైన హక్కులేదు అని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

S.S.Subrahmanyam
N.Kalyani
Advocates, Ramachandrapuram

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా కోర్టు మరియు ఫ్యామిలీ కోర్టు రాజమహేంద్రవరం,తూ॥గో॥జిల్లా
I.A.No.84/2025, I.A.No.85/2025 in O.S.No.101/2018

Between:-
Nekkanti Subbarao ...Petitioner
And
Bhavana Dhanya Lakshmi and Othersm ...Respondents

To.
R8. గుంటూరు ప్రవీణ్ రాజు తండ్రి వరహాలరాజు డోర్‌నెం.1-105, ఈతకోట, రావులపాలెం మండలం, అంబేద్కర్ కోనసీమ జిల్లా.

(వారి తరపున దాఖలు చేసిన కోర్టు నోటీసు)

పై గ్రంధంలో మీకు కోర్టు వారు పంపించిన నోటీసులు అందుకొనక కాలయాపన చేయుచున్నందువల్ల శ్రీ కోర్టువారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ చేసియున్నారు. మీరు విచారణకు ది.17-12-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని వకీలు ద్వారాగాని హాజరు అయ్యి మీ అభ్యంతరాలు శ్రీ కోర్టువారికి తెలియజేసినచో పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్పునిచ్చెదరు.

J.V.Subbarao
Advocate, Rajahmahendravaram
Cell.9603743319

పిటిషన్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టు వారి సముఖమునకు
EA.No.108/2025 in E.P.No.112/2011 in OS.No.159/1990

Between:-
స్వామి ఓంకారానందగిరి(డైడ్)మరియు మరికొందరు ...పిటిషనర్స్/D.H.R No.2
మరియుProposed Parties
మరియు
గుడివాడ కొండయ్య(డైడ్)మరియు మరికొందరు ...రెస్పాండెంట్స్/JDRs
మరియుProposed Parties

R 20. పెనుమాక వెంకట లక్ష్మి, భర్త బుజ్జి, డోర్‌నెం.3-2-16, రాగంపేట పుంత రోడ్, పెద్దాపురం.
R 21. యెర్ర దుర్గ భర్త దుర్గ, డోర్‌నెం.3-2-16, రాగంపేట పుంత రోడ్, పెద్దాపురం.

పిటిషనర్స్ పై నెంబరు అమలు గ్రంథంలో EA.No.108/2025 నెంబరున మీ పైన పిటిషన్ దాఖలు చేసినందున అందుకు మీ ఆక్షేపణలు తెలియచేయుటకు మీరు పైకోర్టు వారి ఎదుట ది.19-12-2025 తేది ఉదయం గం10.30నిలకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయబడును అని తెలియచేయడమైనది.

చావలి కృష్ణారావు
పిటిషనర్స్ తరుపు అడ్వకేట్
పెద్దాపురం, సెల్.9866733570

ప్రకటన
మహారాజశ్రీ గౌరవ నియ్యలైన జూనియర్ సివిల్ జడ్జ్ ప్రత్తిపాడు
I.A.No.1059/2023 O.S.No.303/2023

Between:-
బొద్దా నాగేశ్వర రావు ...ప్లెయింటిఫ్
మరియు
పేకపాయల శ్రీనివాసరావు ...రెస్పాండెంట్

ప్లెయింటిఫ్ అయిన నేను అనగా బొద్దా నాగేశ్వర రావు తండ్రి సత్తిబాబు రెస్పాండెంట్ అయిన పేకపాయల శ్రీనివాసరావు తండ్రి గంగరాజు, ఏలేశ్వరం గ్రామం ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా అను వారి పై O.S. కేసు నెం.303/2023 గా గౌరవ నియ్యలైన జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రత్తిపాడు వారి కోర్టు నందు దాఖలు చేసి పై నెంబర్ కేసులో కోర్టు వారి నుండి రెస్పాండెంట్‌కి ఎన్నిసార్లు నోటీసులు, సమన్లు పంపిన తీసుకోకుండా కాలయాపన చేస్తూనారు. రెస్పాండెంట్ హాజరు నిమిత్తం గౌరవనీయ కోర్టు వారు కేసు వాయిదా 18-12-2025వ తేదీనకు వేసియున్నారు. ది. 18-12-2025వ తేదీన రెస్పాండెంట్ స్వయంగా కాని ప్లీడరు గారు ద్వారా కాని కోర్టుకి హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలసినదిగా ఈ విధంగా కోర్టు వారు కాకుండా ఆక్షేపణలు తెలియచేయని యెడల రెస్పాండెంట్ పరోక్షముగా కేసు తీర్మానించబడునని కోర్టు వారి ఆర్డర్ పై ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఆర్డర్ పై)
N.V.S.S.N.L.DEVI
Advocate, Yeleswaram
Cell.9989359545

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జివారి కోర్టు రాజమహేంద్రవరం
M.V.O.P.No.592/2023

Between:-
Ganja Surya Devi ...Petitioner
And
Dimmila Yegllayya and Others ...Respondents

R1. Dimmila Yegllayya, S/o.Dimmila Narayudu, Hindu, Male, aged 55years, Driver of Tipper Lorry bearing No.AP 39 UM 1679. R/o.D.No.4-138, S.C.Colony, Vannepudi Village, Gollaprolu Mandal, Kakinada District,A.P. ...1st Respondent

పై నంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్ని సార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు.కావున ది.23-12-2025 సం॥ర తేదీ ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
సి.హెచ్.వెంకటరెడ్డి
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
11-12-2025 సెల్.9908840499

పిటిషన్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టు వారి సముఖమునకు
EA.No.109/2025 in E.P.No.112/2011 in OS.No.159/1990

Between:-
స్వామి ఓంకారానందగిరి(డైడ్)మరియు మరికొందరు ...పిటిషనర్స్/D.H.R No.2
మరియుProposed Parties
మరియు
గుడివాడ కొండయ్య(డైడ్)మరియు మరికొందరు ...రెస్పాండెంట్స్/JDRs
మరియుProposed Parties

R 20. పెనుమాక వెంకట లక్ష్మి, భర్త బుజ్జి, డోర్‌నెం.3-2-16, రాగంపేట పుంత రోడ్, పెద్దాపురం.
R 21. యెర్ర దుర్గ భర్త దుర్గ, డోర్‌నెం.3-2-16, రాగంపేట పుంత రోడ్, పెద్దాపురం.

పిటిషనర్స్ పై నెంబరు అమలు గ్రంథంలో EA.No.109/2025 నెంబరున మీ పైన పిటిషన్ దాఖలు చేసినందున అందుకు మీ ఆక్షేపణలు తెలియచేయుటకు మీరు పైకోర్టు వారి ఎదుట ది.19-12-2025 తేది ఉదయం గం10.30నిలకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయబడును అని తెలియచేయడమైనది.

చావలి కృష్ణారావు
పిటిషనర్స్ తరుపు అడ్వకేట్
పెద్దాపురం, సెల్.9866733570

మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
EP.No.26/2025 in OS.No.28/2020

Between:-
పెచ్చెట్టి ఉమామహేశ్వరి భర్త ఆనందరావు సూర్యనగర్ అమలాపురం ...పిటిషనరు/DHR
మరియు
పెచ్చెట్టి సుమలత భర్త వెంకట దుర్గాప్రసాద్, సూర్యనగర్ అమలాపురం ...రెస్పాండెంట్/JDR

వేలం ప్రకటన

దావా డిక్రీకాక్ వసూలు నిమిత్తం JDR తాలూకు పిటిషను షెడ్యూలు ఆస్తిని ది.29-12-2025 సం॥తేదిన ఉదయం గం10.30నిలకు పైన తెల్పిన వారి కోర్టులో వేలం వేయబడును. వేలం పాటలో పాల్గొన దలచినవారు పిటిషనరు న్యాయవాదిగారిని గాని, కోర్టు అమీనా వారిని గాని సంప్రదించి పాట వివరాలు తెలుసుకొనవలెను.

షెడ్యూలు

డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా Erstwhile తూర్పుగోదావరి జిల్లా అమలాపురం సబ్‌రిజిష్ట్రార్ ఆఫీసు అమలాపురం మున్సిపాలిటీ సూర్యనగర్ ఏరియా 235 చ.గ.స్థలం R.S.No. 466/2 అందలి R.C.C.డాబా Bearing యుంటినెం. 5-4-58/6కకు హద్దులు.

తూర్పు : పుచ్చల నాగ వెంకట వర ప్రసాద్‌గారి స్థలం, దక్షిణం : బాలసదన్ కు చెందిన ఉమెన్ మేనేజు వైల్ఫ్ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రహరీగోడ, పడమర : 18 అడుగుల వెడల్పు బందలి బాలసదనుకు చెందిన ఎ.పి.స్టేట్ గవర్నమెంట్ వైల్ఫ్ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఉత్తరం : యల్లమెల్లి సత్యనారాయణ యల్లి వారి స్థలం మధ్య 235 చ.గ.స్థలం అందలి R.C.C.బిల్డింగ్ యావమెంట్ హక్కులు, మార్గములు, తీసి మార్గములు సర్వం సహా DHR. Value. Rs.30,00,000
అమీనా విలువ Rs.50,00,000

కుడుపూడి అశోక్
అమలాపురం పిటిషనరు తరపు న్యాయవాది
ది.11-12-2025 అమలాపురం

తుని పురపాలక సంఘం

ఆర్.ఒ.సి. నెం. 388/2017/ఇ1 తేది.11-12-2025

"ఇ" ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు

తుని పురపాలక సంఘం నందు సాధారణ నిధులతో 2 పనులు మరియు హెచ్.ఎమ్. & ఎఫ్.డబ్ల్యు. (యూ.పి.హెచ్.సి) నిధుల నుండి 1 పని చేపట్టి పూర్తి చేయుటకు "ఇ" ప్రొక్యూర్మెంటు ప్లాటుఫారంపై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది. 12-12-2025 ఉదయం గం॥ 11.00 నుండి www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సంప్రదించవలసిన చిరునామా:
తుని మున్సిపాలిటీ, ఫోన్ నెం. 9849905806, 9849919375, 0885-4-253506,
email : tunimunicipality@gmail.com

సం/- ఎ.వెంకటరావు, కమిషనరు, తుని పురపాలక సంఘం